ఆరుట్లలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్ సమీర్

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

కంది,ఏప్రిల్ 27: పోలింగ్ కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని మెదక్ పార్లమెంట్ ఎన్నికల అబ్జర్వర్ సమీర్ మాధవ్ కర్‌కోటి అధికారులకు సూచించారు. శనివారం ఆరుట్ల గ్రామంలోని పోలింగ్ బూత్‌ను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలని, దివ్యాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక ఓటర్లతో మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎద్దుమైలారంలోని పోలీస్ చెక్ పోస్టును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుజాత, తహసీల్దార్ విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ మల్లయ్య తదితర అధికారులు ఉన్నారు.

పోలింగ్ స్టేషన్లు సిద్ధం చేయాలి

అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు గోపాల్ జీ తివారీ

కోహీర్, ఏప్రిల్ 27: పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించే పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేయాలని ఎన్నికల పరిశీలకుడు గోపాల్ జీ తివారీ అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని దిగ్వాల్, గురుజువాడ, సిద్దాపూర్ తండాలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని కోరారు. ఓటుహక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చే వారికి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దివ్యాంగుల కోసం ర్యాంపు, ట్రైసైకిళ్లు ఏర్పా టు చేయాలన్నారు. ఓటర్లకు స్లిప్పులు అం దించాలన్నారు. పోలీసులు తనిఖీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజు, తహసీల్దార్ బాలశంకర్, బీఎల్వోలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలి

తెల్లాపూర్‌లో ఓటరు అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు, టీనా అధ్యక్షుడు రమణ

రామచంద్రాపురం, ఏప్రిల్ 27: ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని నోడా అధికారి, అమీన్‌పూర్ కమిషనర్ జ్యోతిరెడ్డి, తెల్లాపూర్ కమిషనర్ సంగారెడ్డి, తహసీల్దార్ సంగ్రం రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రవీందర్ అన్నారు. శనివారం తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటరు అవగాహన ర్యాలీలో అధికారులు, గేటెడ్ కమ్యూనిటీ వాసులు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహిస్తూ ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీనా అధ్యక్షుడు ఈశ్వరిగారి రమణ, టీనా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'ఖేడ్'లో బీఆర్ఎస్ ముమ్మర ప్రచారం

నారాయణఖేడ్ మున్సిపాలిటీ 2వ వార్డులో ఓటు అడుగుతున్న బీఆర్ఎస్ నాయకులు

నారాయణఖేడ్, ఏప్రిల్ 27: నారాయణఖేడ్‌లో శనివారం బీఆర్ఎస్ నాయకులు ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తరపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో పర్యటించి కారుగుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా జాప్యం చేస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రశ్నించే గొంతుకగా ఉన్న బీఆర్ఎస్‌ను గెలిపించి కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలన్నారు. మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏ ఒక్క వర్గాన్ని సంతృప్తి పర్చకుండా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ప్రజల పక్షాన పోరాడే అనిల్‌కుమార్‌ను గెలిపించే దిశగా కారుగుర్తుకు ఓటువేయాల న్నారు. నగేశ్, నజీబ్, బాసిత్, అభిషేక్ శె ట్కార్, శేఖర్, గోపాల్, సతీష్, నర్సింహు లు, పండరి, సిద్దు, రవి, శంకర్, సాయిలు పాల్గొన్నారు.

కార్మికుల భద్రతకు పెద్దపీట

కార్మికుల భద్రత దినోత్సవంలో పాల్గొన్న భెల్ ఈడీ రాజా, అధికారులు

రామచంద్రాపురం, ఏప్రిల్ 27: కార్మికుల భద్రతకు భెల్ పరిశ్రమ పెద్దపీట వేస్తుందని ఈడీ కేబీ.రాజా అన్నారు. శనివారం ప్రపంచ భద్రతాదినోత్సవం సందర్భంగా భెల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈడీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం భద్రతా పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భెల్ సంస్థ కార్మికుల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పరిశ్రమ లోపల భద్రత నిబంధనలను పకడ్బందీగా పాటిస్తున్నామని తెలిపారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో భెల్ అధికారులు శ్రీనివాసరావు, ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ప్రవీణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీవిద్య, యూనియన్ అధ్యక్షుడు ఎస్‌డీవి కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షల్లో ఒకరు డిబార్

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 27: జిల్లాలో కొనసాగుతున్న ఓపెన్ స్కూల్ వార్షిక పరీక్షల్లో భాగంగా శనివారం ఒకరు డిబార్ ఆయ్యారు. ఉదయం జరిగిన ఇంటర్మీడియట్ పొలిటికల్ సైన్స్ పరీక్షకు మొత్తం 2924 మంది అభ్యాసకులకు 2649 మంది హాజరయ్యారు. 275 మంది అభ్యాసకులు గైర్హాజరయ్యారు. దీంతో 91శాతం హాజరు నమోదైంది. పదో తరగతికి సంబంధించిన గణితం పరీక్షకు మొత్తం 2195 మంది అభ్యాసకులకు 1958 మంది అభ్యాసకులు హాజరయ్యారు. 233 మంది గైర్హాజరయ్యారు. 89శాతం హాజరు నమోదైంది. మధ్యాహ్నం జరిగిన ఇంటర్మీడియట్ కెమిస్ట్రీ పరీక్షకు 813 మందికి 737 మంది అభ్యాసకులు హాజరయ్యారు. 91శాతం హాజరు నమోదైంది. పదో తరగతికి సంబంధించిన బిజినెస్ స్టడీస్ పరీక్షకు 41 మంది అభ్యాసకులకు 33 మంది హాజరయ్యారు. 8 మంది అభ్యాసకులు గైర్హాజరయ్యారు. దీంతో 80 శాతం హాజరు నమోదైంది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి ఫ్లయింగ్ స్క్వాడ్స్ సంగారెడ్డి, పటాన్‌చెరు, ఆర్‌సీపురంలోని పలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఆర్‌సీపురం ఎల్ఐజీలోని విద్యా భారతి హైస్కూల్‌లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఒక అభ్యాసకున్ని డిబార్ చేశారు. డీఈవో వెంకటేశ్వర్లు పటాన్‌చెరు, సంగారెడ్డిలోని వివిధ పరీక్షా కేంద్రాలను సందర్శించారు. అదేవిధంగా జిల్లా స్థాయి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షా కేంద్రాలను సందర్శించారు.

కందిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

పటాన్‌చెరు పట్టణంలో బీఆర్ఎస్ జెండావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, తదితర నాయకులు

జహీరాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, దేవీప్రసాద్, నాయకులు, కార్యకర్తలు

తెలంగాణ ఇంటి పార్టీ బీఆర్ఎస్

పటాన్‌చెరు, ఏప్రిల్ 27: తెలంగాణ ఆత్మగౌరవం కోసం పోరాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరు పట్టణంలోని బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహం సమీపంలో పార్టీ జెండాను బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్కడితో మొదలైన బీఆర్ఎస్ ప్రస్థానం తెలంగాణ ఉద్యమంగా మారి స్వరాష్ట్ర కలను నిజం చేసిందన్నారు. సుదీర్ఘకాలం రాష్ట్ర సాధన కోసం పోరాడిన కేసీఆర్‌ను మహానేతగా కొనియాడారు. తొమ్మిదిన్నర ఏండ్లపాటు తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిపారన్నారు.కేసీఆర్ సారధ్యంలో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కేసీఆర్...తెలంగాణ గాంధీ: ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కంది, ఏప్రిల్ 27: ప్రాణాలను సైతం లెక్క చేయకుండా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ తెలంగాణ గాంధీ అని బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. శనివారం కందిలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ 23వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేసి జై తెలంగాణ.. జై కేసీఆర్ నినాదాలు చేశారు. నాయకులు, కార్యకర్తలు, జిల్లా ప్రజలకు బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా కేసీఆర్ పార్టీని స్థాపించి అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర సాధన కోసం ఆమరణ దీక్ష చేపట్టి చావును చవిచూసిన ఘనుడు కేసీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ సరళాపుల్లారెడ్డి, కాసాల బుచ్చిరెడ్డి, నరహరిరెడ్డి, ఖాజాఖాన్, విజయేందర్‌రెడ్డి, చిల్వేరి ప్రభాకర్, డాక్టర్ శ్రీహరి, మామిళ్ల రాజేందర్, కంది మండలాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఆనంద్ రావు, నందకిశోర్, వరలక్ష్మి పాల్గొన్నారు.

కేసీఆర్ ఉద్యమాలతోనే తెలంగాణ: మాణిక్‌రావు

కోహీర్, ఏప్రిల్27: కేసీఆర్ ఉద్యమాలతోనే తెలంగాణ సిద్ధించిందని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. శనివారం జహీరాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఎగురవేశారు. కేసీఆర్ చేపట్టిన ఉద్యమంతోనే తెలంగాణ ప్రజల చిరకాల కోరిక సాకారమైందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే 2001లో ఉద్యమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు.

తెలంగాణ అస్తిత్వం కోసం కేసీఆర్ పోరాటం

తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడేందుకే కేసీఆర్ 2001లో ఉద్యమాన్ని ప్రారంభించారని జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సమన్వయ కర్త దేవీప్రసాద్ పేర్కొన్నారు. తెలంగాణ కోసం ఆవిర్భవించిన బీఆర్ఎస్ అద్భుత విజయాలను సాధించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా తెలంగాణ ఉద్యమకారులపై రైఫిల్ ఎక్కుపెట్టాడని ఆరోపించారు. ఇలాంటి వాళ్లు తెలంగాణ కోసం ఏం చేస్తారని ప్రశ్నించారు. జహీరాబాద్ ఎంపీ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం 65వ జాతీయ రహదారి పక్కన ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఎన్నికల సమన్వయ కర్త దేవీప్రసాద్ భారత రాష్ట్ర సమితి కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తట్టు నారాయణ, వెంకటేశం, గుండప్ప, నామ రవికిరణ్ గుప్తా, యాకూబ్, బండి మోహన్, రాకేశ్, షేక్ ఫరీద్, బరూర్ దత్తాత్రి పాల్గొన్నారు.

జిన్నారం మండలంలో...

జిన్నారం, ఏప్రిల్ 27 : బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జిన్నారం మండలవ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. జిన్నారంలోని పార్టీ కార్యాలయం వద్ద పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా నాయకుడు వెంకటేశంగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉద్యమ సారథి కేసీఆర్ నడిపించిన ఉద్యమాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సింహారెడ్డి, నీలం మోహన్, భిక్షపతిగౌడ్, మంద రమేశ్, గాండ్ల శ్రీనివాస్, బ్రహ్మేందర్ గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, సంతోశ్‌గౌడ్, నిఖిల్ గౌడ్, నర్సింగరావు, లక్ష్మీనారాయణ, గోపి, రాజు, రాకేశ్ పాల్గొన్నారు.

గుమ్మడిదల మండలంలో...

గుమ్మడిదల, ఏప్రిల్27: మండలకేంద్రంలో బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. జడ్పీటీసీ కుమార్‌గౌడ్, సీనియర్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రామకమిటీ అధ్యక్షుడు దాసరి ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగాబీఆర్ఎస్ జెండా ఎగురవేసి పండుగ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో పొన్నాల శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి, మద్దుల బాల్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, వాసుదేవా రెడ్డి, యాదగిరి, కేబుల్ సంజీవరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

మోసం చేసిన కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి

ప్రచారంలో మాజీఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



ఉమాకాంత్‌కు కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, ఏప్రిల్ 27: ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఎంపీ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం నారాయణఖేడ్ మండలం హంగిర్గ(బి),అల్లాపూర్‌లల్లో పర్యటించి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తరపున ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.2 లక్షల రైతు రుణమాఫీ, రూ.15 వేల రైతుభరోసా, మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులకు రూ.4 వేల పింఛన్ వంద రోజుల్లో అమలు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో మాట ఇచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. ఎంపీ ఎన్నికల్లో మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 13 హామీల ద్వారా లబ్ధి పొందిన వారు కాంగ్రెస్‌కు ఓటేయ్యాలని, రానివారు బీఆర్ఎస్‌కు వేయాలని కోరారు. కారు గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే కాంగ్రెస్ మెడలు వంచి ఆరు గ్యారెంటీలు అమలయ్యే విధంగా పోరాటం చేస్తామన్నారు.

కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లోకి ...

హంగిర్గ(బి)కి చెందిన ఉమాకాంత్ కాంగ్రెస్‌ను వీడి భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సక్రమంగా లేదని, బీఆర్ఎస్ సమర్థవంతమైన ప్రతిపక్షపాత్ర పోషించి ప్రజలకు న్యాయం చేస్తుందనే నమ్మకంతో ఉమాకాంత్ బీఆర్ఎస్‌లో చేరినట్లు భూపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పరమేశ్, రవీందర్‌నాయక్, సత్యపాల్‌రెడ్డి, సంగప్ప, ఏక్‌నాథ్‌రావు, భోజిరెడ్డి, మనోహర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- గడపగడపకూ కాంగ్రెస్ వైఫల్యాలను వివరించాలి
- బీఆర్ఎస్ గెలిచే మొదటి సీటు మెదక్
- వెంకట్రామిరెడ్డి గెలుపు...మెదక్ అభివృద్ధికి మలుపు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- జిన్నారం, గుమ్మడిదల, బొల్లారం మండలాల సన్నాహక సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, గులాబీ జెండాలు ఊపుతూ నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, నాయకులు

జిన్నారం, ఏప్రిల్ 27 : హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జిన్నారం, గుమ్మడిదల, బొల్లారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కేసీఆర్ పాలనలో పదేండ్లపాటు గ్రామాలు అభివృద్ధిలో దూసుకుపోయాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో సంక్షేమ పథకాలు అటకెక్కాయన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను ఢిల్లీకి తాకట్టుపెట్టి గులాం గిరి చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పాలన్నారు. పరిపాలన అనుభవం ఉన్న వ్యక్తి, సమర్థుడు, ఉమ్మడి జిల్లాపై పూర్తి అవగాహన ఉన్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపిస్తే మెదక్ అభివృద్ధికి నిరంతరం పని చేస్తారని చెప్పారు. ప్రజాస్వామ్యంలో అధికారం ఎవరికి శాశ్వతం కాదని, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. కార్యకర్తలే వెన్నెముకగా పనిచేసే బీఆర్ఎస్ పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తుందన్నారు. 13 రోజులపాటు బూత్ స్థాయి నుంచి ప్రచారం వేగవంతం చేయాలని కార్యకర్తలను కోరారు. అంతకుముందు గడ్డపోతారం శివాలయంలో పూజలు చేసి బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొని జెండాను ఆవిష్కరించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వంపై గడ్డపోతారం మాజీ సర్పంచ్ ప్రకాశ్‌చారి పాడిన పాట నాయకులు, కార్యకర్తల్లో నవ్వులు పూయించాయి. అనంతరం ఎమ్మె ల్యే, స్టేజీమీద ఉన్న నాయకులు, కార్యకర్తలతో కలిసి బీఆర్ఎస్ జెండాలు ఊపుతూ డీజే పాటలకు డ్యాన్స్ చేసి కార్యకర్తలతో ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, గుమ్మడిదల జడ్పీటీసీ కుమార్ గౌడ్, మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు వెంకటేశం గౌడ్, గోవర్ధన్ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్, బొల్లారం అధ్యక్షుడు హనుమంత్‌రెడ్డి, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, జిన్నారం, గుమ్మడిదల, బొల్లారం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తా..ఆదరించండి

అందోల్, ఏప్రిల్ 27 : అందోల్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా.. ఆదరించాలని జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జోగిపేట పట్టణంలో శనివారం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. పదేండ్లలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, మైనార్టీల అభివృద్ధి కోసం పాటుపడిందన్నారు. ప్రపంచంలో దేశాన్ని ముందువరసతో నిలిపారన్నారు. మోదీ ప్రభుత్వం సం క్షేమ పథకాలతోపాటు, త్రిపుల్ తలాక్, మైనార్టీలకు 33శాతం రిజర్వేషన్లు ఇచ్చి నిరుపేదలకు అండగా నిలిచిందని బీబీపాటిల్ అన్నారు. మళ్లీ బీజేపీ ప్రభుత్వం వస్తే మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అలె భాస్కర్, జగదీశ్వర్, ప్రభాకర్ గౌడ్ ఉన్నారు.

సందడిగా సిద్ధి వినాయక ఆలయాలు

న్యాల్‌కల్, మార్చి 28: మండలంలోని సిద్ధి వినాయక ఆలయాలు శనివారం భక్తులతో సందడిగా మారాయి. సంకష్టహర చతుర్దశిని పురస్కరించుకొని ఉదయం నుంచే రేజింతల్ సిద్ధివినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారికి దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అలయ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. హద్నూర్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో, చీకూర్తిలోని సిద్ధి వినాయక ఆలయాల్లో కూడా చతుర్దశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులు ఆయా ఆలయాల్లో అన్నదానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోహీర్, ఏప్రిల్ 27: మండలంలోని దిగ్వాల్ గ్రామ శివారులోని 65వ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై కృష్ణయ్య కథనం ప్రకారం.. రంజోల్ గ్రామానికి చెందిన మహమ్మద్ నసీరుద్దీన్(35) కొద్దిరోజులుగా మద్రి గ్రామంలో నివాసం ఉంటున్నాడు. మద్రి గ్రామానికి వెళ్లేందుకు రాయిపల్లి శివారులోని జాతీయ రహదారిని దాటుతుండగా ప్రమాదవశాత్తు గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతడిని తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం జహీరాబాద్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. శవాన్ని పోస్టుమార్టం కోసం జహీరాబాద్ దవాఖానకు తరలించారు. తండ్రి బాబూమియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

ఝరాసంగం, ఏప్రిల్ 27: మండల పరిధిలోని మాచ్నూర్, బర్దీపూర్, ఎల్గోయి, కుప్పనగర్, కృష్ణాపూర్ గ్రామాల్లో శనివారం బీఎల్‌వోలు ఓటరు జాబితాలో పేరున్న వారికి ఓటుహక్కు సద్వినియోగం చేసుకునే విధంగా ఇంటింటికెళ్లి ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు.

నాగల్‌గిద్ద మండలంలో...

నాగల్‌గిద్ద, ఏప్రిల్ 27: మండలంలోని ఇరక్‌పల్లి, ఎనక్‌పల్లి, మేగ్యానాయక్ తండాల్లో శనివారం ఆర్ఐ, హన్మంత్‌రెడ్డి, బీఎల్వోలు ఇంటింటికీ తిరుగుతూ ఓటరు పత్రాలను పంపిణీ చేశారు.

నేడు బొల్లారంలో ప్రచార ర్యాలీ

బొల్లారం, ఏప్రిల్ 27: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం ఉదయం 11 గంటలకు కాంగ్రెస్ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి, పార్టీ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

వీరభద్రస్వామి జాతర ప్రారంభం

రాయికోడ్, ఏప్రిల్ 27: రాయికోడ్‌లోని వీరభద్ర స్వామి ఆలయంలో శనివారం జాతర ప్రారంభమైంది. బీదర్ నుంచి రాయికోడ్‌కు గంగాధర శివాచార్యస్వామి ఆధ్వర్యంలో 500 మంది పాదయాత్రగా వీరభద్ర స్వామి ఆలయానికి చేరుకున్నారు. వారికి జుట్టు ఈశ్వర్యయ్య స్వామి ఘనంగా స్వాగతం పాలికారు.

మోసపూరిత హామీలిచ్చిన కాంగ్రెస్‌కు

గుణపాఠం చెప్పాలి

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కంది: ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కంది, ఏప్రిల్ 27: మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. 15 రోజులు సైనికుల్లా పనిచేసి మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎంపీ ఎన్నికల్లో భాగంగా శనివారం కందిలోని పార్టీ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలన ప్రజలకు అర్థమైందని, ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని పేర్కొన్నారు. ఆగస్టు 15 వరకు హామీలను అమలు చేస్తామంటూ మరోసారి మోసం చేయాలని చూస్తున్న కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. గ్రామాల్లో ప్రచార జోరును పెంచాలన్నారు. గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి ప్రణాళికాబద్ధంగా ముం దుకు సాగాలన్నారు. ఈనెల 29న కంది, సదాశివపేటలో నిర్వహించనున్న రోడ్‌షోలో మాజీమంత్రి హరీశ్‌రావు పాల్గొంటారని తెలిపారు.

జగ్గారెడ్డివి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు: ఎర్రోళ్ల శ్రీనివాస్

సంగారెడ్డి మాజీఎమ్మెల్యే జగ్గారెడ్డివి బ్లాక్‌మెయిల్ రాజకీయాలని, ఆయన మాటలు ఎవరూ నమ్మవద్దని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్ పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. సంగారెడ్డి ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరుతున్నారంటూ ప్రకటించడం అవివేకమన్నారు. గ్రామాల్లో ఓటు బ్యాంక్ తగ్గకుండా కలిసికట్టుగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. కేసీఆర్ బస్సుయాత్రతో ప్రజల్లో సానుభూతి పెరిగిందన్నారు. 4నెలల కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసుగు చెందారన్నారు. గ్రామా ల వారీగా బాధ్యతలు తీసుకొని పని చేయాలన్నారు. సమావేశంలో ఎంపీ పీ సరళాపుల్లారెడ్డి, కాసాల బుచ్చిరెడ్డి, నరహరిరెడ్డి, మామిళ్ల రాజేందర్, డాక్టర్ శ్రీహరి, విజయేందర్‌రెడ్డి, వరలక్ష్మి, చిల్వేరి ప్రభాకర్, మధుసూదన్‌రెడ్డిఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.